ప్రజాశక్తి

సోమవారం 29 డిసెంబర్ 2025

8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

సంక్రాంతికి ముందే 'బరి'

- అధికార పార్టీ నేత అండతో కోడి పందేలు
- అధికారులకు ముందే సమాచారం
- సోషల్ మీడియాలో రావడంతో పోలీసుల దాడులు

ప్రజాశక్తి-కంచికచర్ల

సంక్రాంతి పండుగకు ముందే కంచికచర్ల మండలంలో కోడి పందేల రాయుళ్ల 'బరి' తెగించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వందలాది మంది పందెం రాయుళ్లను పిలిపించి మరీ కోడి పందేల బరులను ఏర్పాటు చేస్తున్నారు. మామిడి తోటలో యథేచ్ఛగా బరి ఏర్పాటు చేసి సుదూర ప్రాంతాల నుండి పందెం రాయళ్లను తీసుకురావడం అంటే నిర్వాహకులకు అధికారంలో ఉన్న పెద్దలు, అధికారుల అండదండలు లేకపోలేదని ప్రజలు భావిస్తున్నారు. కంచికచర్ల మండలం గండేపల్లి సమీపంలోని మామిడి తోటల్లో ప్రతిఏటా సంక్రాతి రోజుల్లో యథేచ్ఛగా కోడి పందేల బరులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాతి పండుగకు 20 రోజల ముందుగానే గండేపల్లి సమీపంలోని మమిడితోటల్లో కోడి పందేల బరులను సిద్ధం చేశారు. ప్రభుత్వ పెద్దలు, అధికారుల ఆశీస్సులతో గండేపల్లికి చెందిన ఓ నాయకుడు తన అనుచరులతో కలిసి కోడి పందేల బరిని సిద్ధం చేశారు. గండేపల్లి సమీపంలోని మామిడి తోటలో ఆదివారం నుండి కోడి పందేలు నిర్వహిస్తామని, ముందుగానే సమాచారం అందజేస్తున్నందున బరివైపుకు వచ్చి దాడులు చేయవద్దని ముందుగానే సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. అనుకున్న విధంగానే ఆదివారం మామిడి తోటలో బరిని ఏర్పాటు చేశారు. గండేపల్లి కోడి పందేలకు నందిగామ, ఇబ్రహీంపట్నం, విజయవాడ, మైలవరం, తిరువూరు, తెలంగాణాలోని మధిర, కోదాడ తదితర ప్రాంతాల నుండి బైక్‌లు, కారులలో వందలాది మంది పందెం రాయుళ్లు పందెం కోళ్లను తీసుకువచ్చారు. కోడి పందేలకు వచ్చిన వారికి అక్కడే భోజన వసతి ఏర్పాటు చేశారు. పందేలు జరుగుతుండగానే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ (మిగతా 2లో)

పందెం రాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

భోజనం కోసం క్యూలో ఉన్న పందెం రాయుళ్లు

కేంద్ర మంత్రితో సిఎం భేటీ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం విమానాశ్రయంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం భేటీ అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ముగించుకుని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర మంత్రిని చంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమెతో కొద్దిసేపు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

జన్యు లోపాలే వ్యాధులకు కారణం

- తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన అవసరం
- ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు శ్రీదేవి

ప్రజాశక్తి-ఎ.కొండూరు

తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధులపై ప్రజా ఆరోగ్య వేదిక, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఎపి - కృష్ణా) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎ.కొండూరు ఎండిఒ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సు, ఉచిత రక్త పరీక్షల వైద్యశిబిరానికి మండలంలోని అనేక గ్రామాల నుండి వందలాది మంది హాజరయ్యారు. వైద్యుల సూచనలు తీసుకుని ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకున్నారు. ప్రజారోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయప్రకాష్ అధ్యక్షతన జరిగిన అవగాహనా సదస్సులో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వి.శ్రీదేవి మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధులు (మిగతా 2లో)

సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు శ్రీదేవి

విద్యుత్ వినియోగంలో సమస్యలకు పరిష్కారం

- పిఎం సూర్యఘర్ పథకం అమలుకు చర్యలు
- సోలార్ విద్యుత్ మోడల్ గ్రామాలుగా ఐదు ఎంపిక
- విజయవాడ సర్కిల్ ఎలక్ట్రికల్ ఎస్ఇ హనుమయ్య

ప్రజాశక్తి-విజయవాడ

విద్యుత్ వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్, ఎన్‌టిఆర్ సర్కిల్ ఎస్ఇ యు.హనుమయ్య చెప్పారు. ఇంధనం పొదుపు చేద్దాం... భావితరాలకు వెలుగునిద్దాం... మహోద్యమంగా విద్యుత్ పొదుపును తీర్చిదిద్దుదాం... అనే నినాదంతో విద్యుత్ ఆదాతో పాటు, సూర్యఘర్ పథకంలో భాగంగా సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలసీ పట్ల వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సూర్యఘర్ పథకం అమలు, విద్యుత్ వినియోగం, ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై ఎస్ఇ 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ఎన్‌టిఆర్ జిల్లాలో సోలార్ మోడల్ గ్రామాలెన్ని?

జవాబు: జిల్లాలోని ఐదు గ్రామాలను 'సోలార్ మోడల్' విలేజ్‌లుగా తీర్చిదిద్దడానికి చర్యలు (మిగతా 2లో)

కార్మికులకు అండ... సిఐటియు జెండా

- సమస్యల పరిష్కారానికి ఆందోళన, పోరాటాలు,
- భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు పరిహారం
- పోర్టు రవాణా కార్మికులకు ఆరు నెలల వేతనాలు చెల్లింపు
- మచిలీపట్నంలో గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు
- రిలయన్స్ కార్మికులకు నెల రోజుల అదనపు వేతనం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: సంఘటిత, అసంఘటితరంగ కార్మికులకు సిఐటియు అండగా నిలుస్తోంది. ఆయా తరగతుల కార్మికులను ఐక్యం చేసి సమస్యల పరిష్కారానికి పోరాటాలను నిర్వహిస్తోంది. కృష్ణాజిల్లాలో ప్రమాదంలో మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందింది. పోర్టు రవాణా కార్మికులు వేతనాలు సాధించుకున్నారు. పారిశ్రామిక కార్మికుల తొలగింపునకు వ్యతిరేకంగా, ప్రమాదంలో గాయపడిన మహిళకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై పారిశ్రామిక రంగ కార్మికులకు సిఐటియు అండగా నిలిచింది. ఆయా సందర్భాల్లో కార్మికులకు వేతనాలు, ఇతర ప్రయోజనాలు అందాయి. ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరుగునున్న సిఐటియు ఆలిండియా మహాసభల సందర్భంగా కృష్ణాజిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో ఇటీవల కాలంలో నిర్వహించిన పోరాటాలను కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు. ... ప్రత్యేక కథనం 5లో

మిర్చికి నల్ల తామర బెడద

ప్రజాశక్తి-నందిగామ

మార్కెట్లో గిట్టుబాటు ధర లేక మిర్చి రైతులు నష్టపోతున్నారు. గతేడాది శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చికి ఆశించిన మేర ధర రాలేదు. దీంతో ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన కాయలను కల్లాల్లోనే ఆరబెట్టి విక్రయిస్తున్నారు. నల్ల తామర పురుగు ఉధృతితో మిరప తోటలు నల్ల బారి దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఆ పురుగును అరికట్టేందుకు మందుల పిచికారీకి అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 14,350 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ఎన్ఎస్‌పి, మునేరు కాలువల ఆయకట్టులో, నీటివసతి ఉన్న రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టారు. మొదటి కోత కాయలను ఆరబెట్టి దళారులకు విక్రయిస్తున్నారు. సన్నరకం కాయలు క్వింటా రూ.14 వేల ధర పలుకుతున్నాయని రైతులు తెలిపారు. రెండేళ్ల క్రితం క్వింటాకు రూ.23 వేల ధర పలికింది. గతేడాది గిట్టుబాటు ధర లేదు. నల్లతామర పురుగుతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి రావాలని, ఈసారి 15 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వస్తుందని అంచనా. నల్లతామర పురుగు నివారణకు వారంలో రెండుసార్లు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఎకరానికి నెలలో ఎనిమిది సార్లు పురుగు మందు పిచికారీకి రూ.20 వేలు ఖర్చవుతోందని రైతు కె.శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శీతల గిడ్డంగుల అద్దె పెరిగి, మిర్చి ధరలో పెరుగుదల లేక రైతులు నష్టానికి విక్రయించారు. ఈ అనుభవంతో ప్రస్తుత సీజన్లో శీతల గిడ్డంగులకు తరలించకుండా కల్లాల్లోనే విక్రయిస్తున్నారు. చందర్లపాడు, వీరులపాడు, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో మిర్చిని అధికంగా సాగుచేశారు. పంట చేతికొచ్చే సరికి మొత్తంగా ఎకరానికి రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుందని, ఈసారి కూడా పెట్టుబడులు చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. కేవీకే శాస్త్రవేత్తలు, గుంటూరు లాంఫాం శాస్త్రవేత్తలు ఇటీవల మిరప తోటలను పరిశీలించి నల్లతామర ఉధృతి తగ్గించడానికి రైతులకు సూచనలు చేశారు. అయితే ఇప్పటికే పంటకు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు.

నివారణా చర్యలు చేపట్టాలి: నందిగామ ఎడిఎ శ్రీనివాస్

తెగులు సోకిన ఆకులను కత్తిరించి తెల్ల కాగితంపై వాటిని విదిలించాలి. తీవ్రంగా తెగులు సోకిన మొక్కలను పొలంలో నుండి తొలగించాలి. అధిక నత్రజని ఎరువుల ఉపయోగాన్ని నివారించాలి. అధిక మోతాదులో పురుగు మందులను వాడటం వల్ల పంటకు సహాయకారులుగా ఉండే కీటకాల జనాభా తగ్గుతుంది. అందువల్ల పురుగు మందుల వాడకం తగ్గించాలి.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. అమ్మవారిని సుమారు 10వేల మంది యాత్రికులు దర్శించుకోగా అత్యధిక స్థాయిలో యాత్రికులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే కృష్ణాజిల్లా సోషల్ వెల్ఫేర్ డిడి ఎస్.కె రహీద్ బాబు, గుడివాడ ఎక్సైజ్ సీఐ పీ వెంకటరమణ, ఎస్సై పి హేమ సుస్మిత లు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటం ప్రసాదాలను చైర్మన్ మోహన్, ఈవో కొండలరావు లు అందజేశారు.

నేడు 'పది' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి -చల్లపల్లి

సోమవారం ఉదయం 10 గంటల నుండి చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ క్లాసు నిర్వహించనున్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ఈ శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ, అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, డీఈవో యువి.సుబ్బారావు హాజరవుతారని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మాజీ ఎంపి కంభంపాటికి సిఎం పరామర్శ

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం రాత్రి ఉంగుటూరు మండలం పెద్ద ఆవుటుపల్లిలోని మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు నివాసానికి వెళ్లి ఆయనున్న పరామర్శించారు. కంభంపాటి రామ్మోహన్‌రావు తల్లి వెంకటనరసమ్మ చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, అదనపు ఎస్పీ సత్యనారాయణ, గుడివాడ ఆర్డీఓ జి బాలసుబ్రమణ్యం, ప్రత్యేక భద్రతాధికారి శాంతి కుమారు, ఇంటలిజెన్స్ ఇన్చార్జి డిఎస్పి వెంకటేశ్వరరావు, గన్నవరం డిఎస్పి చలసాని శ్రీనివాసరావు, సహాయ ఆహార తనిఖీ అధికారి సిహెచ్ గోపాలకృష్ణ, సిపిడిసిఎల్ ఈఈ హరిబాబు, ఉంగుటూరు తహసిల్దార్ విమలకుమారి, ఎంపీడీవో సత్యకుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి - గుంటూరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర 51వ కౌన్సిల్ సమావేశాలు జనవరి 10, 11 తేదీలలో గుంటూరులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదిరవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ హాలులో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1993లో రాష్ట్ర మహాసభలు గుంటూరులో జరిగాయని తిరిగి 2026 జనవరిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావే శాలలో విద్యారంగ సమస్యలపై, ఉపాధ్యాయులపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు రూపొందించుకోవటం జరుగుతుం దన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్. కుసుమ కుమారి మాట్లాడుతూ 10 పదవ తేదీ ఓపెన్ సెషన్ ఉంటుందని, ఇందులో పెద్ద ఎత్తున ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రచరణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ 10వ తేదీ బహిరంగ సభ, ఉపాధ్యాయుల ర్యాలీ ఉంటుంది, రెండవ రోజు ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కౌన్సిల్ 32ఏళ్లతరువాత గుంటూరులో జరుగుతుందని, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గని జయప్రదం చేయాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

జన్యు లోపాలే వ్యాధులకు కారణం

రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

జన్యు పరమైన వ్యాధులని తెలిపారు. మలేరియాని తట్టుకునే క్రమంలో జరిగిన జన్యు మార్పుల వల్ల తలసేమియా వస్తుందని, ఈ వ్యాధి కారణంగా ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గిపోవడం వల్ల రక్తహీనత వస్తుందని చెప్పారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిలో ఎర్ర రక్త కణాలు గుండ్రటి ఆకారం నుండి కొడవలి ఆకారంలోకి మారడం వల్ల రక్త ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, దీని వల్ల నొప్పులు, నీరసం, స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కుటుంబంలో తల్లి, తండ్రి ఇద్దరూ క్యారియర్స్ (జబ్బును కలిగించే జన్యువు కలిగి ఉండటం) అయితే పిల్లలకు జబ్బు వస్తుందని, 14 నుండి 16 వారాల్లోపు గర్భిణులకు స్క్రీనింగ్ టెస్ట్ చేయడం ద్వారా పిల్లలకు వచ్చే అవకాశం ఉందో లేదో ముందే తెలుసుకోవచ్చని అన్నారు. ఎ.కొండూరు మండలంలో ఈ వ్యాధులు ఉన్నందున, రక్త పరీక్షలు చేయడం ద్వారా వ్యాధి సంక్రమణ తీవ్రత బట్టి సకాలంలో వైద్యం చేయడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించవచ్చని, భవిష్యత్తులో తలసేమియా రాకుండా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ రక్తహీనత ఉందని వైద్యుని సలహా లేకుండా సొంతగా ఐరన్ మందులు వాడకూడదని, శరీరంలో ఐరన్ పేరుకుపోయే అవకాశం ఉంటుందని చెప్పారు. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య వేదిక కిడ్నీ జబ్బులపై గత ఏడేళ్ల నుండి ఎ.కొండూరులో పని చేస్తుందని, దానికి కొంత పరిష్కార మార్గాన్ని చూపగలిగామని, అదే పద్ధతిలో తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియాపై కూడా పని చేస్తున్నట్లు చెప్పారు. ఎ.కొండూరులో ఈ వ్యాధులను పూర్తిగా రూపుమాపే వరకు ప్రజా ఆరోగ్య వేదిక పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కిన్నెర ఫౌండేషన్ అధినేత కె.రాజగోపాల్, కిడ్నీ బాధితుల సంక్షేమ సంఘం నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు మాలావత్ కుమార్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భాను ఆనందరావు, ప్రజారోగ్య వేదిక జిల్లా కోశాధికారి బి.బాలసుందరి, నాయకులు బి.లీల, పి.రాణి, బి.ఆదిలక్ష్మి, పి.రమేష్ చంద్ర, స్థానిక పెద్దలు పి.ఆనంద్‌రావు, భూక్య జమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంలో సమస్యలకు పరిష్కారం

తీసుకుంటున్నాం. నందిగామ డివిజన్‌లోని పరిటాల, జగ్గయ్యపేట డివిజన్‌లో బూదవాడ, ఎస్ఎన్‌పేట, మైలవరం డివిజన్‌లో యలవడం, తిరువూరు డివిజన్‌లో కంభంపాడు గ్రామాలను సోలార్ మోడల్ విలేజ్‌లుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేసి, కార్యాచరణకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: సూర్యఘర్ కింద కిలో వాట్‌కు మొత్తం ఎంత చెల్లించాలి, దానిలో సబ్సిడీ ఎంత ?

జవాబు: ఒక కిలో వాట్‌కయ్యే వ్యయం మొత్తం రూ.80 వేలు కాగా, దానిలో రూ.30 వేలు సబ్సిడీ పోను మిగిలిన రూ.50 వేలు చెల్లించాల్సి వస్తోంది. అలాగే రెండు కిలో వాట్స్‌కు రూ. లక్షా 45 వేలు కాగా దానిలో 60 వేలు సబ్సిడీ పోను రూ.85 వేలు చెల్లించాల్సి వస్తోంది. అలాగే మూడు కిలో వాట్స్‌కు రూ. లక్షా 90 వేలకు రూ.78 వేలు సబ్సిడీ పోగా మిగిలిన రూ. లక్షా 12 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో సబ్సిడీ బాగానే ఉంది. ప్రతి ఒక్క ఔత్సాహికులు ముందుకు రావాలి. సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉన్న ప్రతి ఇంటి యజమానులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలి.

ప్రశ్న: ఎస్సీ, ఎస్టీ తరగతుల ప్రజలకు ఎటువంటి లబ్ది ఉంటుంది?

జవాబు: ఇప్పటికే 200 యూనిట్ల విద్యుత్ వరకు ఫ్రీగా ఎస్‌సి, ఎస్‌టిలు వినియోగించుకోవడం జరుగుతుంది. అయితే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారి గృహాల పైకప్పు 200 స్కేర్‌ఫీట్ ఉండి, ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండాలి. ఈ తరగతుల వినియోగదారులకు రెండు కిలో వాట్స్ వరకు ఎటువంటి ఖర్చు లేకుండా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. మొదటి దశలో జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 35 వేల మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద నెలకు రూ.200 వరకు ఎస్సీ, ఎస్టీలకు అద్దె రూపంలో ప్రభుత్వం ఇస్తుంది.

ప్రశ్న: సూర్యఘర్ పథకం కింద టార్గెట్స్ ఎన్ని? ఇప్పటి వరకు ఎంత వరకు అధిగమించారు?

జవాబు: ఈ స్కీమ్ కింద జిల్లా వ్యాప్తంగా 4,320 కనెక్షన్లకు ఇప్పటి వరకు 2,500 కనెక్షన్లకు పైగా ఇచ్చాం. మిగిలిన కనెక్షన్లను వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది.

ప్రశ్న: జిల్లాలో రోజువారీ విద్యుత్ వినియోగం ఎంత ఉంటుంది?

జవాబు: 98 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉంది. జిల్లాలో మొత్తం 12,68,018 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ వినియోగ కనెక్షన్లు 1,06,741 కాగా, కమర్షియల్ 1,43,103, పరిశ్రమలకు 4,843, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు 14,471, వ్యవసాయ కనెక్షన్లు 98,860 ఉన్నాయి.

సంక్రాంతికి ముందే 'బరి'

కావడంతో స్థానిక ఎస్ఐ విశ్వనాధ్ సిబ్బందితో కలిసి హుటాహుటిన బరి వద్దకు చేరుకున్నారు. పోలీసులు వచ్చేలోపే బరి నిర్వాహకులు, పందెం రాయుళ్లు కోడి పుంజులు కనబడకుండా పక్కకు తప్పించారు. పోలీసులు వచ్చే సమయానికి నిర్వాహకులు తమకేమి తెలియదన్నట్లు మిన్నకుండిపోయారు. నూతన సంవత్సరం వస్తున్నందున ముందుగానే స్నేహితులకు, శ్రేయోభిలాషులకు భోజనాలు ఏర్పాటు చేసుకున్నామని భాష్యం అల్లారు. ఇదిలా ఉండగా కోడి పందేల బరి వద్దకు పందెం రాయళ్లు భారీగా కోడి పుంజలను తీసుకురాగా పోలీసులు దాడులు నిర్వహించి కేవలం మూడు కోడి పుంజులను, 9 బైక్‌లను, ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారివద్ద నుండి కేవలం 8300 రూపాయలు మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే అసలు కోడిపందేల నిర్వాహకులు ఎవరు, కార్లు, మిగతా పందెం కోళ్లు ఎక్కడ అని పలువురు చర్చించుకుంటున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు : సిఐ చవాన్

పండుగలు, సరదాల పేరుతో కోడి పందేలు, ఇతర జూదక్రీడలు నిర్వహిస్తే సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. కంచికచర్ల మండలం గండేపల్లి సమీపంలో మామిడి తోటలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం రాగానే సిబ్బంది వెళ్లి దాడులు చేశారు. కోడి పందేలకు ఎలాంటి అనుమతులు లేవు.

రాష్ట్రానికే తలమానికం రాయనగర్ కో ఆపరేటివ్ సొసైటీ

- ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో వక్తలు

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్రానికే తలమానికం రాయనగర్ కో ఆపరేటివ్ సొసైటీ అని ప్రభుత్వ విఫ్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం మండల కేంద్రంలోని రాయనగర్ కో ఆపరేటివ్ సొసైటీ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చిలకపాటి లక్ష్మారాయుడు, సొసైటీ పూర్వ అధ్యక్షులు గన్నవరం మాజీ సర్పంచ్ కాట్రగడ్డ పెద వెంకట్రాయుడు విగ్రహాలను గన్నవరం, గుడివాడ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, వెనిగళ్ళ రాములు ప్రారంభించి సొసైటీ చరిత్ర పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వెంకట్రావు మాట్లాడుతూ ముందు చూపుతో కూడిన ఆలోచన అభివద్ధి కమ్యూనిస్టులకే సాధ్యమన్నారు. దేశానికే ఆథర్శవంతమైన నాయకుడు మహనీయులు పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలో తాను శాసన సభ్యుడిగా పనిచేయడం పూర్వజన్మ సుకతమమన్నారు. అది పార్లమెంటు అయినా శాసనసభ అయినా తప్పు అనే పదమే తెలియని గొప్ప నాయకుడు సుందరయ్య అని, అలాంటి నాయకుల స్ఫూర్తితో గన్నవరంలో ఆదర్శవంతంగా కోపరేటివ్ సొసైటీని నడపడం ఆదర్శనీయమని, ముందు చూపుతో నే రాయనగర్‌లో ఏ రోడ్డు చూసిన 40 అడుగుల తక్కువ లేకుండా ఏర్పాటు చేసి రాయనగర్ నిర్మాణం చేశారని అది కమ్యూనిస్టుల ముందు చూపు అని అన్నారు. అలాంటి నాయకులు నిర్మించి కొనసాగించిన ఈ సొసైటీని ఏ విధమైన పొరపాటు లేకుండా మరింత ముందుకు తీసుకెళ్ళవలసిన బాధ్యత ఈ తరం నాయకత్వంపై ఉందని, దానికి ఒక శాసనసభ్యుని గా నా వంతు సహాయ సహకారాలు పూర్తి గా అందిస్తానని హామీ ఇచ్చారు. గుడివాడ ఎంఎల్ఎ వెనిగళ్ళ రాము మాట్లాడుతూ ఈ సొసైటీ ఈ ప్రాంతం రాష్ట్రనికే ఆదర్మ మన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు మాట్లాడుతూ గన్నవరంనకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని, దానికి నిదర్శనం చింతపల్లి పాపారావు, జాస్తి బసవరావు, కాట్రగడ్డ చినవెంకట్రాయుడు, పామర్తి సుబ్బారావు, ఇరుగు నోబెల్ లాంటి 24 మంది ఆనాటి పాలకుల ప్రజా వ్యతిరేఖ విధాలను ప్రతిఘటించి తుపాకీ గుళ్ళకు బలయ్యారని అన్నారు. ప్రజాప్రతినిధులు ఎలా ఉండాలి అనేదానికి పుచ్చలపల్లి సుందరయ్య, మానికొండ సూర్యావతి, అట్లూరి శ్రీమన్నారాయణ, డాక్టర్ సి ఎల్ రాయుడు లాంటి వారిని నేటి పాలకులు ఆథర్శంగా తీసుకోవాలన్నారు. డాక్టర్ రాయుడు వైద్యం అందించడమే కాక ఈ ప్రాంతం అభివృద్ధిలో విద్యాలయాల స్థాపనలో ఆయన స్పూర్తి బావితరాలకు ఆదర్శం అనితానికి ఉదాహరణే ఈ సొసైటీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు, గన్నవరం మాజీ శాసనసభ్యులు ముసునూరి రత్నబోస్, మూల్పూరి బాలక్రష్ణ, డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, గన్నవరం సర్పంచ్ పాలడుగు వెంకట రామ వరప్రసాద్ (నాని), మాజీ సర్పంచ్ గూడపాటి తులసీమోహన్, విశాలాంధ్ర బుక్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దు వెంకటరత్నం, మన్నే సుందరావు, డాక్టర్ సి ఎల్ రాయుడు, కాట్రగడ్డ పెద వెంకట్రాయుడు కుటుంబ సభ్యులు, రాయనగర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో మీకోసం

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మీకోసంప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగుతుందన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాల యాలలో అందజేయ వచ్చన్నారు. మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

డిపాజిట్లతో భవిష్యత్ కు భరోసా

ప్రజాశక్తి-మోపిదేవి : డిపాజిట్లతో భవిష్యత్తుకు భరోసా ఏర్పడుతుందని పిఎసిఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు అన్నారు. మోపిదేవి మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద ప్రత్యేక డిపాజిట్ల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరువోలు గ్రామానికి చెందిన కర్రా సురేష్ డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా కర్రా సురేష్ చైర్మన్ సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా రైతులకు చైర్మన్ సుబ్బారావు డిపాజిట్ లపై అవగాహన కల్పించారు. పిఎసిఎస్ లలో ప్రతి ఒక్కరూ డిపాజిట్ చేసుకోవచ్చునని తెలిపారు. డిపాజిట్ల ద్వారా ప్రతి ఒక్కరికి భరోసా ఏర్పడుతుందన్నారు.

నేడు చల్లపల్లిలో రెవెన్యూ క్లినిక్

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ క్లినిక్ జరుగుతుందని తహశీల్దార్ డి. వనజాక్షి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం భూసంభందిత సమస్యల పరిష్కా రానికి ఈ క్లినిక్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం పదిన్నర నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగు ఈ క్లినిక్ లో 22 ఏ సమస్యలు, భూసేకరణ సంబంధిత సమస్యలతోపాటు ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు. ప్రతి సోమవారం పనిదినాల్లో ఈ రెవిన్యూ క్లినిక్‌ను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు : చలికాలంలో మంచిసేవా దక్పథంతో పేద ప్రజలకు దుప్పట్ల పంపిణీ చేయడం అభినందనీయమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ అన్నారు. కంకిపాడు మాజీ వార్డ్ మెంబర్ వంకదారు చిట్టబ్బాయి వర్ధంతి సందర్భంగా ఆయన తమ్ముడు వంకదారు కన్నయ్య ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో వైవిబి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని వంద మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా సగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, తెదేపా నాయకులు బండి నాంచారయ్య, కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, డాక్టర్ గాజుల శ్రీమన్నారాయణ, యేనుగ జయ, వంకదారు హరిబాబు, సాయి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

సెలవుదినాల్లో తరగతులు నిర్వహిస్తున్న

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఉయ్యూరు : సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ఎంఈఓ సుధారాణి పై శాఖాపరమైన చర్యలు తీసుకో వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉయ్యూ రులోని నారాయణ స్కూల్ ఎడ్యుకేషన్ సంస్థలలో నిబంధనలకు వ్యతిరేకంగా ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ విద్యాసంస్థలు ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాలను భేకాతరు చేస్తూ విద్యార్థులపై ఒత్తిడి పెంచే దిశగా కార్పొరేట్ సంస్థలు తయారయ్యాయని ఆయన విమర్శించారు. ప్రత్యేక తరగతుల పేరుతో ఆదివారాలు క్లాసులు నిర్వహించడం తగదన్నారు. విద్యాశాఖ అనుమతి లేకున్నా కార్పొరేట్ సంస్థలు క్లాసులు నిర్వహించడంలో ఏమాత్రం సంకోచం లేకుండా నడపగలుగుతున్నారంటే విద్యాశాఖ చర్యలు శూన్యమని తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా సెలవు దినాలలో తరగతులు నిర్వహించ కుండా చర్యలు తీసుకోవాలని సలీం డిమాండ్ చేశారు .

రేపు ఎంవి కృష్ణారావు పాత్రికేయ మిత్ర పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈ నెల 30న మధ్యాహ్నం మూడు గంటలకు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మండలి వెంకటకృష్ణారావు శతజయంతి కమిటీ ఆధ్వర్యంలో కృష్ణరాయ పాత్రికేయ మిత్ర పురస్కార ప్రదాన ఉత్సవం నిర్వహిస్తున్నట్లు శతజయంతి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారని, ముఖ్య అతిథిగా సి ఆర్ మీడియా అకాడమీ అధ్యక్షులు ఆలపాటి సురేష్ కుమార్ పాల్గొన్నట్లు చెప్పారు. అదేవిధంగా ఆత్మీయ అతిథిగా విశ్రాంతి ఆకాశవాణి సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి పాల్గొనన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

డోకిపర్రు ఆలయంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామివారిని ఆదివారం అధికసంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. భక్తులు తమ మొక్కుబడులను భక్తిప్రపత్తులతో తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆర్థిక సాయంతో జరిగింది. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారు.

తేలప్రోలు గ్రామ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-గన్నవరం : (ఉంగుటూరు) : ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామ సర్పంచ్ లాంగ్ దిబోరా (40) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మరణించారు. గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఆమె మతి పట్ల గ్రామ ప్రజలు, పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్ర తినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృత దేహానికి కుటుంబ సభ్యులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు-అవనిగడ్డ ప్రధాన పంట కాలువలో యువకుని మతదేహం లభ్యమైనట్లు కోడూరు ఎస్సై చాణిక్య తెలిపారు. ఆదివారం మాచవరం గ్రామం వద్ద సుమారు (25 నుండి 30) వయసుగల మగ వ్యక్తి మృతదేహం పంట కాలువలలో కొట్టుకు వచ్చిందన్నారు. మృతుడు బ్లాక్ కలర్ టీ షర్ట్ ,బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. ఈ వ్యక్తికి సంబంధించిన ఏదైనా సమాచారం తెలిసిన యెడల, కోడూరు పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని కోరారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కాజ గ్రామం పొలాల్లో ఆదివారం కోత ముక్క (పేకాట) ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 1640 రూపాయలు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు కూచిపూడి ఎస్సై పి శిరీష తెలిపారు. ప్రజలు ఇటువంటి అసాంఘిక కార్యకలా పాలకు దూరంగా ఉండాలని సూచించారు. పేకాట, కోడి పందాల గురించి ఏదైనా సమాచారం ఉంటే 9440796473, 08671252333. ఈ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

లక్ష్మీపురంలో పిచ్చికుక్క స్వైరవిహారం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం, వక్కలగడ్డలలో పిచ్చికుక్క దాడిలో శని, ఆదివారాల్లో మొత్తం 9 మంది గాయ పడ్డారు. జయంపాటి శ్రీదేవి, సూదాని విష్ణుమూర్తి తీవ్రంగా గాయపడి చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వక్కలగడ్డలో ఐదుగురు కుక్క కాటుకు గురయ్యారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిపిఎం అభిమాని పఠాన్ మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఇస్లాంపేటకు చెందిన సిపిఎం అభిమాని పఠాన్ (84) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సిపిఎం మండల పార్టీ కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల పార్టీ నాయకులు మీరాఖాన్, గన్నవరం పట్టణ కమిటీ నాయకులు మిరప నాగేశ్వరావు, మాదిరెడ్డి చిన్న, బాబావలీ, దాదా తదితరులు నివాళులు అర్పించారు. ఆయనకు బార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

భోజనం ప్లేట్లు అందజేత

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానంకు రేపల్లెకు చెందిన కీర్తిశేషులు మునగాల సాంబశివరావు మీనా కుమారి దంపతుల పేరు మీద వారి కుమార్తె తూనుగుంట్ల ధర్మ నాగేశ్వరరావు వెంకటలక్ష్మి సునీతదేవి దంపతులు 106 భోజనం ప్లేట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావుకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

7న సుబ్రహ్మణ్యేశ్వర హుండీ లెక్కింపు

మోపిదేవి గ్రామంలో వెలసిన శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో హుండీ లెక్కింపు జనవరి 7వ తేదీన బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు నిర్వహిస్తున్నట్లు దాసరి శ్రీరామ వరప్రసాద రావు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు డ్రెస్ కోడ్ (పారంపర్య దుస్తులు) తో వచ్చి పాల్గొనవచ్చాన్నారు.

కొండెక్కిన కోడి

ప్రజాశక్తి- నందిగామ : నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. వంటింట్లో కుపంటి పెట్టాలంటేనే దడుసుకునే పరిస్థితి నెలకొంది. ఉప్పు, పప్పులతోపాటు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇక ఇదే బాటలో చికెన్, కోడి గుడ్ల ధరలు కూడా ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో చికెన్ రూ.280 నుంచి రూ.300 వరకు పలుకుతుంది. ఇక గుడ్డు ధర ఏకంగా రూ.8:30 చేరింది. కేవలం వారంలోనే కిలో చికెన్‌పై రూ.50 పెరిగింది. నందిగామలో కార్తీక మాసం ముగిసినప్పటి నుండి చికెన్ ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కిలో చికెన్ స్కిన్‌తో రూ.260లు కాగా.. స్కిన్ లెస్ చికెన్ రూ.280 నుండి 300 పలుకుతుంది. మాంసం ప్రియులు అధిక ధరలు చెల్లించి చికెన్ కొనలేక గుటకలు వేస్తున్నారు. వచ్చే నెలలో సంక్రాంతి ఉండటంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు. మరోవైపు కోడి గుడ్ల ధరలు కూడా పెరగడంతో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు సైతం అందించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు కేవలం రూ.6 మాత్రమే చెల్లిస్తోంది. మార్కెట్‌లో హెూల్‌సేల్ ధర రూ.7.50 ఉంది. రిటైల్ ధర రూ.10 పలుకుతోంది. ఈ క్రమంలో విద్యార్థులకు వారానికి మూడు సార్లు అందించవల్సిన గుడ్లను రెండు సార్లు మాత్రమే అందిస్తున్నారు.

గత కొద్దిరోజులుగా కోడిగుడ్లు, చికెన్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కార్తీక మాసం ముగియడం, వరుస పండుగలు రావడంతో చికెన్‌కి ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్లుగా పౌల్ట్రీ ఉత్పత్తి లేకపోవడంతో సరఫరా దెబ్బతిని ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. మొత్తం వచ్చే పండగ నెలలోనూ చికెన్ రేట్లు కిలో రూ.350 నుంచి రూ.400 వరకు పలికే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

అల్ట్రా సౌండ్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నంది గామ పట్టణంలోని డివిఆర్ ఏరియా హాస్పిటల్‌లో

రూ.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన అల్ట్రా సౌండ్ ల్యాబ్‌ను మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, హాస్పిటల్ కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావుతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. ఈ అల్ట్రా సౌండ్ ల్యాబ్ ద్వారా గర్భిణులు, మహిళలు, పేద ప్రజలకు స్థానికంగానే కీలక వైద్య పరీక్షలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ చక్కటి అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు వినియోగించుకోవాలని ఆమె కోరారు. అనంతరం హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కమిటీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, హాస్పటల్ సూపరింటెండెంట్ డా. సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఇంగ్లీష్ తప్పనిసరి

ప్రజాశక్తి - తిరువూరు : వివిధ పోటీ పరీక్షలలో నెగ్గాలంటే ఇంగ్లీష్‌పైన పట్టు ఉండాలని ఇంగ్లీష్ రిసోర్స్ పర్సన్ ఎం.రాం ప్రదీప్ అన్నారు. తిరువూరు గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఆయన వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఇంగ్లీష్ వ్యాకరణంపై అవగాహన కల్పించారు. 8, 9, 10వ తరగతుల ఇంగ్లీష్ పాఠ్య పుస్తకాలపై

అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం తాను రూపొందించిన క్లాస్ రూమ్ ఇంగ్లీష్ పుస్తకాలను గ్రంథాలయ అధికారిణి పద్మావతి అందజేశారు.

జోగికి బెయిల్ రావాలని పాదయాత్ర

ప్రజాశక్తి -జి.కొండూరు : మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన తమ్ముడు రాముకు బెయిల్ రావాలని కోరుతూ వైసిపి వెలగలేరు గ్రామ అధ్యక్షుడు యర్ర గుంట సుకుంద్ పార్టీ గ్రామ నాయకులతో

కలిసి వెలగలేరు సీఎస్ఐ చర్చి నుండి విజయవాడ గుణదల మేరీ మాత ఆలయం వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయంగా కల్తీ మద్యం కేసులో జోగి రమేష్‌ను, ఆయన తమ్ముడు రామును అరెస్టు చేశారని, త్వరలోనే వారు కడిగిన ఆణిముత్యంలో బయటికి వస్తారని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రతాప్ , గంగుల సాంబయ్య దేవమాతారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: డాక్టర్ జంపాల సాహితి 13వ వర్ధంతి సందర్భంగా జంపాల సాహితి ఫౌండేషన్ చైర్మన్ జంపాల సీతారామయ్య, కుటుంబ సభ్యులు కాచవరం అమ్మానాన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం నూతన

వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జంపాల మాట్లాడుతూ తన కుమార్తె డాక్టర్ సాహితి వర్ధంతి సందర్భంగా ప్రతిఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముమ్ముందు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.

ముగిసిన పాపాయమ్మ అంత్యక్రియలు

బాబూరావు, కాశీనాథ్, పలువురు నాయకులు సంతాపం

ప్రజాశక్తి-విజయవాడ : వయోభారంతో మృతి చెందిన సిపిఎం నాయకులు దుర్గారావు మాతృమూర్తి కరోతి పాపాయమ్మ దహన సంస్కారాలు ఆదివారం సింగ్‌నగర్ వాంబేకాలనీ స్మశాన వాటికలో జరిగాయి. సింగ్‌నగర్‌లోని 59వ డివిజన్‌లోని తన నివాసం నుంచి అంతిమయాత్ర స్మశాన వాటిక వరకు జరిగింది.

ఈ కార్యక్రమానికి ముందుగా పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు హాజరై పాపాయమ్మకు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, ఆంధ్ర మాల్యాద్రి, విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ.కమల, ఐద్వా జిల్లా నాయకులు కాజ సరోజ, ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం సీతారాములు, నాయకులు సిహెచ్ శ్రీనివాస్, ఎస్‌కె నిజాముద్దీన్, వై సుబ్బారావు, ఎం బాబూరావు, ఎస్‌కె పీరు, ఎం హనుమంతరావు, ఎం సోమేశ్వరరావు, ప్రజాశక్తి ఉమ్మడి కృష్ణా జిల్లా కన్వీనర్ ఎంబి.నాథన్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

నేడు ఉరుసు మహోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లిలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా 429వ ఉరుసు మహోత్సవాలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణాన్ని శుద్ధిచేసి సుందరంగా అలంకరిస్తారు. ఈ నెల 30న మంగళవారం గంధం మహెూత్సవం వైభవంగా జరుగుతుంది. రైల్వే స్టేషన్ సెంటర్ ముజావర్ల ఇంటి నుండి గంధం కొండపల్లి వీధుల వెంట ఊరేగింపుగా దర్గా వద్దకు చేరుతుంది. అనంతరం బాబాకు గంధం సమర్పించి భక్తులకు అందజేస్తారు. బుధవారం దీపారాధన నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉరుసు మహెూత్సవ కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా మాట్లాడుతూ.. ఉరుసు ఉత్సవానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కృష్ణా నదిలో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండలం చెవిటికల్లు వద్ద కృష్ణానదిలో ఒక వ్యక్తి మృతిదేహం తేలియాడుతూ కనిపించింది. కంచికచర్ల ఎస్సై పి. విశ్వనాథ్ అందించిన వివరాల ప్రకారం చెవిటికల్లు గ్రామానికి చెందిన మాలాజి నందియ్య (70) ఈ నెల 25న ఇంటి నుంచి పనికి వెళ్ళాడు. ఆదివారం ఉదయం చెవిటికల్లు గ్రామం వద్ద కృష్ణ నదిలో పడి తన తండ్రి నందియ్య మృతి చెందారని ఆయన కుమారుడు సురేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన యేసుక్రీస్తు జయంతి వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విశ్వవ్యాప్త కతోలిక శ్రీసభలో యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలు నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ, చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతాయని విజయవాడ కేథలిక్ డయోసిస్ (విజయవాడ కతోలిక మేత్రాసనం) మోస్ట్ రెవ. బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఉద్ఘాటించారు. బెంజిసర్కిల్ సమీపంలోని

పటమట నిర్మలా హైస్కూల్ ప్రక్కన ప్రఖ్యాతిగాంచిన సెయింట్ పాల్స్ కథెడ్రల్లో ఆదివారం సాయంత్రం జరిగిన యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ జోసఫ్ రాజారావు దైవ సందేశమిస్తూ విశ్వశాంతి దూత దివంగత పోప్ ఫ్రాన్సిస్ వారు 2025 సంవత్సరాన్ని యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ వేడుకలుగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా అన్నిదేశాలలోని అన్ని కేథలిక్ డయోసిస్లలో డిసెంబర్ 28న యేసుక్రీస్తు జయంతి జూబిలీ ముగింపు వేడుకలు నిర్వహించటం విశ్వాసులలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్, సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణకర్తలు రెవ. ఫాదర్ మువ్వల ప్రసాద్, విజయవాడ కతోలిక పీఠం వికార్ జనరల్ రెవ.ఫాదర్ యం.గాబ్రియేలు పాల్గొన్నారు. అనంతరం సెయింట్ పాల్స్ కథెడ్రల్లో శోభాయమానంగా అలంకరించిన పవిత్ర పూజాపీఠంపై పీఠాధిపతులు (బిషప్) తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ యం.గాబ్రియేలు, పొక్రెయిటర్ ఫాదర్ కిరణ్ తదితర డయోసిస్ గురువులు క్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. అంతకుముందు యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ క్రీస్తు శిలువను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గుణదలమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు స్వామి, ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ పి.కె.జోసఫ్, ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్విక్ కామర్స్ ద్వారా పెరిగిన ఆర్డర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడలో ఒక క్విక్ కామర్స్ యూజర్ పెరిగారని సంస్థ ప్రతినిధి ఎం.ప్రసన్న తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. బ్యాగులు, ఉపకరణాల ఆర్డర్లు గత సంవత్సరంతో పోలిస్తే ప్లస్ 538 శాతం పెరిగాయన్నారు. ఇన్స్టామార్ట్ ద్వారా పెద్ద ఎత్తున ఆర్డర్లు ఉన్నాయని తెలిపారు. విజయవాడ ఇకపై కిరాణా సామాగ్రిని టాప్ అప్ చేయడం మాత్రమేకాదని, జీవనశైలిని అప్గ్రేడ్ చేస్తోందని నివేదిక తెలిపిందని అన్నారు.

విశ్వకర్మ వేద విజ్ఞానం గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం, శ్రీ వీరబ్రహ్మేంద్ర దేశీయ విశ్వబ్రాహ్మణ అసోసి యేషన్ (ఎస్వీబీడీ వీబీ) విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు అరండల్ పేటలోని శ్రీ విరాట్ విశ్వకర్మ సామాజిక ప్రాంగణంలో ఆదివారం ఉదయం "విశ్వకర్మ - వేదవిజ్ఞానం" గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు.

ఈ సభకు ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం అధ్యక్షులు జంపని రాధాకష్ణముర్తి అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా వీవీఐటీ ప్రొఫెసర్ ఆచార్య తియ్యబిండి కామేశ్వరరావు పాల్గొని గ్రంథ ఆవిష్కరణ చేసారు. ప్రొఫెసర్ మురుగుడు శ్రీవారి మాట్లాడుతూ వేదాధ్యయనం వలన హృదయ నిర్మల్యం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున కొండ సుందరాచారి, గ్రంథ సంకలనకర్త కొండపి వేంకట గణేష్ బాబు, సంఘం ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస సుధాకర్ బాబు, పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజా మహోత్సవం

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : కొత్తపేట వాగు శ్రీ వీరాంజనేయ స్వామిసన్నిధిలోని అయ్యప్ప స్వామివారి ఉపాలయంలో స్వామివారి మండల పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు డాక్టర్ విన్నకోట శ్రీనివాసరావు శర్మ ఆధ్వర్యంలో ఆలయ గౌరవాధ్యక్షులు బెవర రాము గురు స్వామితో శనివారం ఆలయంలో పడిపూజ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా అయ్యప్ప మండల పూజ మహోత్సవాన్ని భజన గీతాలతో నిర్వహించడం అనవాయితీగా వస్తుందని తెలిపారు. గణపతి పూజ, మండపారాధన, కలశ పూజ, లక్ష్మీ గణపతి హెూమం తోపాటు స్వామివారికి 14 ద్రవ్యాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో వై సీతారామయ్య, ఆలయ చైర్మన్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కార్మికులకు అండ... సిఐటియు జెండా

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు సిఐటియు అండగా నిలుస్తోంది. ఆయా తరగతుల కార్మికులను ఐక్యం చేసి సమస్యల పరిష్కారానికి ఆందోళన పోరాటాలను నిర్వహిస్తోంది. కృష్ణాజిల్లాలో ప్రమాదంలో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందింది. పోర్టు రవాణా కార్మికులు వేతనాలు సాధించుకున్నారు. ఈ కాలంలో సిఐటియు ఆధ్వర్యంలో పారిశ్రామిక కార్మికుల తొలగింపునకు వ్యతిరేకంగా, ప్రమాదంలో గాయపడిన మహిళకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై పారిశ్రామిక రంగ కార్మికులకు సిఐటియు అండగా నిలిచింది. ఆయా సందర్భాల్లో కార్మికులకు వేతనాలు, ఇతర ప్రయోజనాలు అందాయి. ఈనెల 31 వ తేదీ నుంచి జనవరి నాలుగో తేదే వరకు విశాఖపట్నంలో జరుగునున్న సిఐటియు ఆలిండియా మహాసభలు సందర్బంగా జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో ఇటీవల కాలంలో జిల్లాలో జరిగిన ఆందోళన పోరాటాలను మననం చేసుకుంటూ...

- సమస్యల పరిష్కారానికి ఆందోళన, పోరాటాలు
- భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు పరిహారం
- పోర్టు రవాణా కార్మికులకు ఆరు నెలల వేతనాలు చెల్లింపు
- మచిలీపట్నంలో గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

గత మూడు సంవత్సరాల్లో మచిలీపట్నం, దివితాలూకా, గుడివాడ ప్రాంతాల్లో 34 మంది భవన నిర్మాణ కార్మికులు ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. ఆయా సందర్భాల్లో సిఐటియు కార్మికులకు అండగా నిలిచింది. సిఐటియు నాయకత్వంలో ఆందోళనలు నిర్వహించి మృతుల కుటుంబాలకు ఒకొక్కరికి రూ. 3 లక్షల నుంచి ఆరు లక్షలవరకు పరిహారం ఇప్పించారు. 34 మంది కార్మికులకు రూ. కోటి 30 లక్షలు పరిహారం అందింది. ప్రమాదాల భారిన పడిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కార్మికులకు ప్రభుత్వ సాయం అందించేందుకు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్దరణకు ఆందోళన పోరాటాలు నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సుభాష్, మంత్రి కొల్లు రవీంద్ర, నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలను కలిసి రెండు సార్లు వినతి పత్రాలు అందించారు. ఏప్రిల్ 24వతేదీన జిల్ల కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. నవంబర్ 20వ తేదీన మంత్రి కొల్లు రవీంద్ర కార్యాలయం వద్ద నిరసన తెలిపి, కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 1600 సంక్షేమ బోర్డు క్లయిమ్‌లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రవాణా కార్మికులకు వేతనాలు

. మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను సబ్ లీజ్‌కు తీసుకున్న ఊర్మిళ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఛతీజ్‌గడ్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా పశ్చిమబెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 26 మంది రవాణా కార్మికులకు ఆరు నెలలు వేతనాలను పెండింగ్ పెట్టింది. కార్మికులను నిర్బంధించి పనులు చేయించారు. కార్మికుల సమాచారంతో సిఐటియు జోక్యం చేసుకుంది. ఐదు రోజులు పనులు నిలిపివేయించింది.ఈ పోరాట ఫలితంగా ఒకొక్క కార్మికునికి నెలకు రూ. 21 వేల చొప్పన ఆరునెలలకు రూ. 1.26 లక్షలు వేతనాన్ని ఇప్పించింది. 26 మంది కార్మికులకు కాంట్రాక్టు సంస్థ రూ. 32 లక్షల 76 వేలు చెల్లించింది. ఆటో కార్మికులను ఐక్యం చేసి జిల్లా కేంద్రం మచిలీపట్నంలో సిఎన్‌జి ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు సిఐటియు నాయకత్వంలో అధికారులకు పలు మార్పు విజ్ఞప్తులు చేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికుల ఐక్య పోరాటంతో మచిలీపట్నంలో గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటైంది.

ఎటిఎస్ సెంటర్లకు వ్యతిరేకంగా పోరాటం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాహన ఫిట్‌నెస్ తనిఖీలకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఎటిఎస్)ను తీసుకు వచ్చింది. పాత విధానంలో ఆర్టీవో కార్యాలయాల్లో ఫిట్‌నెస్ తనిఖీలకు చిన్న వాహనాలకు రూ. 600, భారీ వాహనాలకు 5 వేల నుంచి 10 వేలు ఫీజులు చెల్లించే వారు. ఎటిఎస్‌లో వాహన తనిఖీ పేరుతో చిన్న వాహనాల నుంచి రూ. 4,500 నుంచి 7,500, పెద్ద వాహనాల నుంచి 15 వేలు నుంచి రూ. 35 వేలు ముక్కుపిండి వసూలు చేశారు. ఎటిఎస్ సెంటర్‌లు రద్దు చేయాలని గుడివాడ మచిలీపట్నం రవాణా శాఖ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ఆందోళన ఫలితంగా ఎటిఎస్ సెంటర్లను తాత్కాలికంగా నిలుపుదల చేసింది. ఆటో, ఇతర వాహనాలకు పెనాల్టీలు పెంచుతూ ప్రభుత్వం తీసుకు వచ్చిన జివో 21ను నిలిపివేయాలని ఆందోళన పోరాటాలు నిర్వహించారు. సూరంపల్లి పారిశ్రామిక వాడలో ప్రమాదానికి గురైన మహిళకు పరిహారం కోసం ఐదురోజులు ఆందోళన నిర్వహించారు.యాజమాన్యం పరిహారానికి అంగీకరించింది. ముస్తాబాద్ రిలయన్స్ గోడౌన్‌లో పనిచేస్తున్న 350 మంది కార్మికులకు రెండు నెలలు జీతాలు చెల్లించకుండా ముందస్తు సమాచారం నోటీసులు ఇవ్వకుండానే తొలగించారు. సిఐటియు నాయకత్వంలో 28 రోజులు గేటు వద్ద కార్మికులు నిరసన దీక్షలు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్

ఆకట్టుకున్న శ్రామికోత్సవ్

ప్రజాశక్తి-గుడివాడ : సిఐటియు ఆలిండియా మహాసభల సందర్భంగా గుడివాడలోని కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకు లను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిరంజీవి ఆలూరి నివేదిత భరత నాట్య ప్రదర్శన సభికులను అలరించింది. చిన్నారులు ప్రసన్న, మేరీ గ్రేసీ, రిబకాలు జానపద నత్యం ప్రదర్శించారు. విశ్రాంత గ్రంథాలయోద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు "శకుని" ఏకపాత్రాభినయం తో ప్రేక్షకు లను అలరించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ప్రభు దాసు, వీరమ్మ, విజయలక్ష్మీలు అభ్యుదయ గీతాలా పన కూడా సభికులను ఆకట్టుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానం అవలంబిస్తూ కార్మిక వర్గాన్ని అణగదొక్కే ప్రయత్నం చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సిపి రెడ్డి ఆరోపించారు. సాహితీ స్రవంతి కోశాధికారి ఎలమర్తి కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈకార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ, సాహితీ స్రవంతి పట్టణ అధ్య క్షులు లంక సురేంద్ర, అయిదవ పట్టణ కార్య దర్శి పి రజిని, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్య క్షులు రేపాని కొండ, సిఐటియు నాయకులు వి. గంగాధర్ మాట్లాడారు.

పోస్టర్ ఆవిష్కరణ... బైక్ ర్యాలీలు

ప్రజాశక్తి-చందర్లపాడు: సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బిల్డింగ్ వర్కర్ యూని యన్ సోమవారం ఉదయం చం దర్లపాడు బస్టాండ్ సెంటర్లో పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో సిఐటి యు ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె.గోపాల్ మాట్లాడుతూ.. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖలో జరుగనున్న మహాస భను జయప్రదం చేయాలని కోరారు. చందర్ల పాడు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్య దర్శి తోట రామారావు, గోపినాయక్, రంగిశెట్టి ఏండుకోండలు, అమీర్ బాషా, మౌలా లి, నాగుల్, మస్తాన్, సుందరావు పాల్గొన్నారు.

చందర్లపాడులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పశ్చిమలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం సిఐటియు పశ్చిమ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఊర్మిళనగర్ పార్క్ ప్రాంతం నుండి బయలు దేరిన బైక్ ర్యాలీ.. భవానీపురం మీదుగా పశ్చిమంలోని ముఖ్య కూడళ్లలో సాగింది. ఇందులో భాగంగా సిఐటియు నేతలు ప్రధాన కూడళ్ళలో జాతీయ మహాసభల నిర్వహణ ఆవశ్యకతతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లారు. తొలుత సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. బైక్ ర్యాలీలో సీఐటీయూ పశ్చిమ అధ్యక్ష, కార్యదర్సులు జి వెంకట్రావు చౌదరి, ఈవి నారాయణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు సుబ్బారెడ్డి, జానీ, ముఠా నాయకులు దాసు, శ్రీ కాంత్ రెడ్డి, మట్టి లిఫ్ట్ యూనియన్ నేతలు సుర శ్రీను, భద్ర పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** విశాఖపట్నంలో సిఐటియు ఆల్ ఇండియా 18వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా బంటుమిల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం, వృత్తిదారుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సిఐటియు మండల కార్య కన్వీనర్ మాజేటి శివ శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, ఏంట్రాపాటి శ్యాము, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి మండలంలో...

కొండ్రు సువార్తకు పురస్కారం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : సావిత్రిబాయి పూలే ఎడ్యుకేష నల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏటా ఇచ్చే సావిత్రి బాయి పూలే విశిష్ట సేవా పురస్కారానికి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల చైర్ పర్సన్ కొండ్రు సువార్త ను ఎంపిక చేసినట్లు ట్రస్ట్ చైర్ పర్సన్ గూడూరు సీతామాలక్ష్మి వక ప్రకటనలో తెలిపారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సాంఘిక విప్లవ యోధురాలు సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా అఖిల భారత అవయవ దాతల సంఘం, సావిత్రి భాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనవరి 3, 2026 వ తేదీన హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో సువార్తను సత్కరించనున్నట్లు తెలిపారు. సమాజానికి సువార్త అందిస్తున్న సేవలు అత్యంత మానవీయమైనవి, అత్యద్భుతమైనవి నిర్వాహ కులు తెలిపారు.

వక్కలగడ్డ విద్యార్థినికి రాష్ట్రస్థాయి బహుమతి

ప్రజాశక్తి -చల్లపల్లి : చల్లపల్లి మండలం వక్కలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జన్ను పావని వక్తత్వ పోటీల్లో రాష్టస్థాయి బహుమతి సాధించింది. 'డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్ధ సత్వర పరిష్కారం' అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో మండల, జిల్లాస్థాయిలో మొదటి స్థానం పొందిన పావని, ఈనెల 23వ తేదీన విజయవాడలో జరిగిన రాష్టస్థాయి పోటీల్లోనూ ప్రథమ స్థానం సాధించింది. ఐఏఎస్ అధికారులు ఢిల్లీరావు, లక్ష్మీశ ల నుండి రూ.10వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకుంది. ఆదివారం పాఠశాల హెచ్‌ఎం కర్రా ఏడుకొండలు, ఉపాధ్యాయ బందం విద్యార్థినిని సత్కరించి అభినందించారు.

ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో పెనమలూరు మం డలం పెనమలూరు గ్రామనికి చెందిన యెలే వెంకటేశ్వ రరావుకు బ్యాటరీ ట్రై సైకిల్‌ను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన

ప్రజాశక్తి-కోడూరు : హంసలదీవి సాగర తీరానికి ఆదివారం పర్యాటకులు ప్రత్యేక వాహనాలతో భారీగా తరలి వచ్చారు. పాలకాయతిప్ప కరకట్ట వద్ద అనుమానం వచ్చిన వాహనాలను మెరైన్ సిబ్బంది తనిఖీలు చేశారు. మెరైన్ సిఐ ఆర్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యాటకులకు మత్తు కలిగించే గంజాయి, డ్రగ్ వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తీరం వెంబడి గస్తీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకాయతప్ప మెరైన్ ఎస్సైలు ఎండ ఉజ్వల్ కుమార్, పూర్ణ మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రుణాలు పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ : లక్ష్మీపురం గ్రామంలో ఉన్న లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది రైతులకు రూ.1 కోటి విలువైన చెక్కులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు సకాలంలో రుణాలు అందించి, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. రైతులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని పంటల దిగుబడిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోటా వీరబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు పటాపంచల రాంబాబు, వాసిరెడ్డి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : ఎన్టీఆర్ జిల్లా పరిటాల గ్రామానికి చెందిన శ్రీ విజయ్ లక్ష్మి స్టోన్ క్వారీ ప్రొప్రయిటర్ గుంటుపల్లి భాస్కరరావు విజయకుమారి దంపతులు పెనుగంచిప్రోలు మండల కేంద్రమైన శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి రూ.10,100 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారికి ఆదివారం విరాళం అందజేశారు. అమ్మవారి పూజల అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ : క్రీడల ద్వారా సోదర భావం, క్రీడాస్ఫూర్తి పెంపొందాల నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. నందిగామ పట్టణం పరిధిలోని నందిగామ-నాసాగరం బైపాస్ రోడ్డులో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల స్థాయిలో వంగవీటి మోహనరంగా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను టోర్నమెంట్ ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి, కూటమి నాయకులు యేచూరు రాము, ఖాజా, కౌన్సిలర్ తాటి వెంకట కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పల్లె పండుగ ద్వారా 2.0 గ్రామీణాభివృద్ధికి నూతన ఊపిరి వచ్చిందని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ పేర్కొన్నారు. మండ లంలోని పాతశాల గ్రామంలో ఎంజి ఎన్ఆర్ ఈసీఎస్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శ్రీరామ్ రాజగోపాల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొనుగుంట్ల రాములమ్మ, సొసైటీ చైర్మన్ వేముల వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా ఇంటికి చేరిన మతిస్థిమితం లేని మహిళ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు తుఫాన్ కాలనీకి చెందిన షేక్ కరీంబికు కొంత కాలంగా మతిస్థిమితం లేదు. మూడు నెలల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కరీంబి సోదరుడు పెనుగంచిప్రోలుకు చెందిన తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ చిన్నతో కలిసి నందిగామ, విజయవాడ, ఖమ్మం, జగ్గయ్యపేట, సూర్యాపేట, తదితర ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడా ఆమె జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, కేరళ రాష్ట్రంలోని కోహ్లిజి కోడ్ దగ్గర కరీంబి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కరీంబి సోదరుడు షేక్ చిన్న కుటుంబ సభ్యులతో కలిసి కేరళ రాష్ట్రం వెళ్లి సోదరి కరీంబీ తీసుకొని పెనుగంచిప్రోలు కు చేరుకున్నారు. కరీంబి ఇంటికి చేరుకోవడంలో సహకరించిన ఎస్ఐ ఎమ్మెస్ కె.అర్జున్‌కు, సిబ్బందికి ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కోడి పందేలు నివారించాలని వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందాల నిర్వహణకు ఇప్పటి నుండే కోడిపందాల బరులను సిద్ధం చేస్తున్నారని, అటువంటి బరులను వెంటనే ధ్వంసం చేసి కోడిపందాలు జరగకుండా చూడాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), జగ్గయ్యపేట సిఐ పి వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్సై టి సూర్య శ్రీనివాస్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో కోడిపందాలు, జూదం వంటివి నిర్వహించడం వలన యువత, విద్యార్థులు పెడదారిన పడుతున్నారని, అటువంటి వాటిని వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటా కృష్ణ, కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, ఫేక్ మేర సాహెబ్, జె వెంకటరావు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మోజెస్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు వి.జె. మోజేష్ డాక్టరేట్ పట్టా పొందారు. సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతిగా మోజెస్ సిక్కిం ఆల్పెన్ యూనివర్సిటీ నుండి ఆయన డాక్టరేట్ అందుకున్నారు. లాంగ్వేజ్ టీచింగ్ మెథడాల జీస్ ఇన్ ది డిజిటల్ ఏజ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయన ఈ డాక్టరేట్ సాధించారు. ఇప్పటికే ఆయన ఆంధ్రా యూనివర్సిటీ నుండి ఇంగ్లీష్ టీచింగ్ మెథడాలజీస్‌లో మాస్టర్స్ డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఇంగ్లీష్ లిటరేచర్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, జాతీయ ఆంగ్ల భాషా బోధన పరీక్షలో ప్రఖ్యాత ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ నుండి ఉత్తీర్ణత సాధించారు. ఈ ప్రతిష్టాత్మక డిగ్రీ లభించిన సందర్భంగా డాక్టర్ మోజెస్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

అనుమనాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నందిగామలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండలం కొత్త బెల్లంకొండ వారి పాలెం గ్రామానికి చెందిన వల్లంకొండ కోటేశ్వరరావు (25) ఆటోనగర్‌లోని సహస్ర ఫార్మా కంపెనీలో కెమిస్ట్రీ ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నారు. రోజులాగానే శుక్రవారం రాత్రి 8 గంటలకు డ్యూటీకి వెళ్లిన కోటేశ్వరరావు శనివారం ఇంటికి రాకపోవడంతో భార్య విజయలక్ష్మి కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించారు. కళ్లుతిరిగి పడిపోతే జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చినట్లు కంపెనీ సిబ్బంది తెలిపారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి చూడగా కోటేశ్వరరావు మృతి చెందడంతో మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. కోటేశ్వరరావు మతి విషయంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన భార్య విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మైలవరం : కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ప్రాణం, స్వాతంత్రానికి పునాది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. భారత రాజకీయ చరిత్రలో సువర్ణ అధ్యయానికి నాంది పలికిన రోజును భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జండా ఎగరవేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సేలం రామకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసపాటి గిరి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, అన్నవరపు దుర్గారావు, అసలు సుధాకర్, బండి చంటి, అక్కల ప్రసాద్ పాల్గొన్నారు.

పశువుల పెంపకంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి మండలం రైతు సేవ కేంద్రం వత్సవాయిలో పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ సౌజన్యంతో మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో గల పశుపోషకులకు లాభసాటి పాడి పశువుల పెంపకంపై రైతు శిక్షణ కార్యక్రమం ఆదివానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట ప్రాంతీయ పశువుల ఆస్పత్రి సహాయ సంచాలకులు డాక్టర్ భవాని ప్రసాద్, నందిగామ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమూర్తి, మండల పశువైద్యులు డాక్టర్ శ్రీను నాయక్, డాక్టర్ ఠాగూర్, డాక్టర్ ఉదయ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు

అధిక వసూళ్లపై చర్యలు : ఇఒ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద పాట దారులు అధిక వసూలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో బి.మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఆలయం వద్ద భక్తులు నుంచి అధిక వసూళ్లకు పాల్పడుతున్న దుకాణాలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని తెలిపారు. కొబ్బరికాయలు కొట్టే చోట సిబ్బంది చల్లని పంచ ధరించాలని సూచించారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం కోదాడ పట్టణానికి చెందిన చందాల శశిరేఖ రూ.10116 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా సిబ్బంది శ్రీ స్వామి వారి ప్రసాదములు అందజేయడం జరిగినదని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కె రవీంద్ర భరద్వాజ్, ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కె సాంబశివరావు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గ గోర్బాయ్ సేవా సంఘం కొత్త కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంగం అధ్యక్షులుగా లాహెూరీ బద్దు నాయక్, ఉపాధ్యక్షులుగా బి కృష్ణ నాయక్, ఎ బ్రహ్మం నాయక్, కార్యదర్శిగా భూక్య బధ్యానాయక్, కోశాధికారిగా ఎల్ మోహన్ డారియ నాయక్, సంయుక్త సంచాలకులుగా రాము నాయక్, ఐటిఐ బాలాజీ నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ బాణావత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా అధ్యక్షులు జటావత్ బాలాజీ నాయక్, ఉపాధ్యక్షులు లాహెూరీ ప్రేమ్నాథ నాయక్ పాల్గొన్నారు.

దేవస్థానం సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని వరద రాజ స్వామి వారి దేవస్థానం పాలకవర్గం సభ్యులు దేవత రామ్మూర్తి, కందిబండ రమేష్‌లకు శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి వెండి దేవాలయం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు పేరూరివెంకట లక్ష్మి నరసింహారావు, జిల్లా కార్యదర్శి పెనుగొండ రామకష్ణ, కోశాదికారి కంభంపాటి రవి కుమార్, యూత్‌అధ్యక్షులు చౌట రమేష్, మహిళా విభాగ కార్యదర్శి ఊటుకూరి అలేఖ్య, పేరూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జికె కో-ఆపరేటివ్ సొసైటీ జగ్గయ్యపేట శాఖ పరిచయ వేదిక సందర్భంగా ఆదివారం పట్టణంలోని గ్రాండ్ వధువర్ ఫంక్షన్ హాల్‌లో సొసైటీ చైర్మన్ జీవన్ మెడూరి, సొసైటీ సభ్యులు జ్యోతిప్రజ్వలన చేసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ జీవన్ మాట్లాడుతూ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు అందిస్తున్నామని, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా చిరు వ్యాపారులు, మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా రీజినల్ హెడ్ టి.వెంకటేష్, క్లస్టర్ మేనేజర్ టి.రాజు, బ్రాంచ్ హెడ్ జి.త్రిపుర, బ్రాంచ్ ఇన్‌ఛార్జ్ ఎస్‌కే. జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వర్ల

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మొవ్వ : గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సరం జనవరి 10వ తారీకు వరకు రెండు వారాలపాటు నిర్వహించే మెగా టోర్నమెంట్స్ ఆదివారం ప్రారంభమైయ్యాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించి నిర్వహించిన ఫ్రెండ్లీమ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గొట్టిపాటిసాయి ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించే స్థితిలో ఆటల పోటీలు నిర్వహించడం ఆనందకరమైన విషయమని పేర్కొన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని రాష్ట్రం గర్వించే క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు గొట్టిపాటి సాయి, రాష్ట్ర గహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, సీనియర్ తెలుగు దేశం నాయకులైన పెడసనగల్లు ఎంపీసీఎస్ అధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు

గ్రామీణ వైద్యుల సేవలు ప్రశంసనీయం : కొనకళ్ల

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే గ్రామీణ వైద్యుల సేవలు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం (ఆర్.యం.డబ్ల్యూ.పి.ఏ.పి) వార్షిక సమావేశం వ్యవస్థాపక అధ్యక్షులు బండి రామాంజనేయులు అధ్యక్షతన స్థానిక ఎన్ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ, గ్రామీణ వైద్యులు పేద ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారన్నారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ పల్లెం ఆకాష్ కొనకళ్ళ టిడిపి రాష్ట్ర నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు, జాతీయ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల సమైక్య అధ్యక్షులు కొండిశెట్టి సురేష్, ఆర్.యం.డబ్ల్యూ.పి.ఏ.పి ఉపాధ్యక్షులు ఏ. కోటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి జి. నంద గోపాల్, కోశాధికారి ఏ. డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కాంగ్రెస్ పార్టీ 141 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ రాట్నం ఉన్న పార్టీ పతాకాన్ని ఎగురవేసారు. ఈ సందర్భంగా అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ బ్రిటిష్ వారి కబంధ హస్తాల నుండి భారతదేశాన్ని రక్షించడం కోసం స్వేచ్ఛా వాయువుల కోసం నడుం బిగించి ప్రాణ త్యాగాలకు సిద్ధపడిన చరిత్ర ఈ దేశంలో కాంగ్రెస్ కు మాత్రమే ఉందని అన్నారు. స్వాతంత్రమే లక్ష్యంగా సత్యం అహింస ఆయుధంగా కాంగ్రెస్ పార్టీ సాగించిన పోరు భారత దేశంలోనే కాక ప్రపంచ దేశాలలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయం అని అన్నారు. అంత ఘన చరిత్ర ఉన్న త్యాగధనుల కాంగ్రెస్ పార్టీని నేటి కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నోటికి వచ్చినట్లు గాంధీని, నెహ్రూని గాంధీ కుటుంబాన్ని

మాట్లాడడం తగదన్నారు. అంతేకాక 2006వ సంవత్సరంలో అప్పటి కేంద్రంలోని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం గ్రామీణ పేద ప్రజల కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తెస్తే నేటి మోడీ ప్రభుత్వం ఆ పథకానికి మంగళం పాడి నిధులను కోసి నిధులు లేని కొత్త పథకాన్ని తేవటం సాక్షాత్తు జాతిపితను అవమానించడమే అని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ కోకా ఫణి భూషణ్, నల్లబోలు కుమారి, చిలుకోటి ప్రసాద్, షేక్ అయ్యుబ్, సామ్యూల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సహాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరం గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధితురాలు వెలగం అనురాధకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు సహాయం చేశారు. రామానగరం తోటవారిబజారులో బడ్డీకొట్టు నిర్వహించుకుంటూ అనురాధ తన ఇద్దరు కుమార్తెలతో నివసించే పూరిల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఆదివారం అనురాధకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ రూ.5వేలు ఆర్థిక సహాయం అందచేశారు. డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ద్వారా వంటపాత్రలు, హెవీ టార్పాలిన్, చల్లపల్లి సబ్ బ్రాంచ్ ద్వారా నిత్యావసర సరుకులు అందచేశారు.

బాధితులకు సాయం అందిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో డీఆర్ఓ కార్యాలయ సీసీ తూము వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఘంటసాల కష్ణమోహన్, చల్లపల్లి సబ్ బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ప్రతినిధులు ఆకురాతి హరిప్రసాద్, బళ్లా మధు, ఆకుల సుధీర్ కుమార్, ట్రెజరర్ ఎండీ.ఏ.కే.జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామంలో గుంటూరు లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం గ్రామంలో రేపల్లె వారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది రేపల్లె జ్యోతిబాసు సౌజన్యంతో లైఫ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ దుర్గా హరిప్రసాద్ వైద్య బృందం విచ్చేసి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పాండ్రాజు నాగ లంకమ్మ ప్రసాద్ ప్రారంభించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేయగా వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ఈ శిబిరంలో 384 మందికి రక్త పరీక్షలు,వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు న్యాయవాది జ్యోతిబసు శుభాభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : సత్య సాయి సేవా సమితి మచిలీపట్నం ఆధ్వర్యం లో మచిలీపట్నం మండలం చిట్టిపాలెం గ్రామంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది.ఇందులో దాదాపు 200 పైగా చిట్టిపాలెం, పరిసర గ్రామ ప్రజలు వైద్య సేవలు ఉపయోగించుకున్నారు. ఈ శిబిరంలో జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ భానుమూర్తి పాల్గొని దాదాపు వందమందికి నేత్ర చికిత్సలు అందచేశారు. 12 మందికి శస్త్ర చికిత్స అవసరము అని నిర్ణయించి,ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రెఫెర్ చేశారు.ఈ కార్యక్రమం లో సమితి సభ్యులు, మాజీ సర్పంచ్ రత్తయ్య, పెద్దలు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లు హాస్టల్‌ను సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్లఓ వసతి, భోజనం, పరిశుభ్రత, భద్రత వంటి అంశాలపై బాలకోటయ్య, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకొని ప్రయోజకులవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం లో వార్డెన్ ధనలక్ష్మి, నేతలు పందిపాటి సుధాకర్, అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యదర్శి ప్రకాశానికి సన్మానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : తెలుగుదేశం పార్టీ నూతనంగా జిల్లా కమిటీ కార్యవర్గాన్ని ఇటీవల ప్రకటించారు. అందులో అవనిగడ్డకు చెందిన అవనిగడ్డ ప్రకాశాన్ని జిల్లా కార్యదర్శిగా నియమించడంతో ఆదివారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం. చిట్టిబాబు ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాలయం వద్ద నూతనంగా జిల్లా కమిటీకి నియమితులైన వారిని సన్మానించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ జిల్లాలో తెలుగుదేశం పార్టీని బలోపేతం

చేసేందుకు కృషి చేయాలని, పార్టీ నాయకులు ఆదేశాల మేరకు కార్యకర్తలను, కలుపుకుపోయే విధంగా కృషి చేయాలని ప్రకాశానికి సూచించారు.ఈ సందర్భంగా ప్రకాశాన్ని పూల దండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాగా జిల్లా కమిటీకి ఎన్నికైన నియోజక వర్గంలోని పార్టీ నాయకులు అందరికీ చిట్టిబాబు శుభాకాంక్షలు తెలిపారు. సన్మానగ్రహీత ప్రకాశం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారి అందరికీ పదవులు వస్తాయని తెలిపారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పుల్లగోరు రాజేంద్రరావు, కొత్తపేట పిఏసిఎస్ చైర్మన్ ఎలవర్తి చిన్న, అవనిగడ్డ పిఏసిఎస్ అధ్యక్షులు మాదివాడ. రత్న రావు, డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, సీనియర్ నాయకులు మతి శ్రీనివాసరావు, లుక్క పిచ్చయ్య, లింగం బాబురావు, గుగ్గిలం శ్యాం కుమార్, అవనిగడ్డ పట్టణ పార్టీ అధ్యక్షులు అన్నపరెడ్డి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డును బైక్‌పై పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడలో సమస్యలలో ఒకటైన బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం తన వ్యక్తిగత సిబ్బంది, పలువురు నాయకులతో కలసి రూ.2.50 కోట్ల ఆర్‌అండ్‌బి నిధులతో ప్రారంభించిన బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. తుది దశలో జరుగుతున్న ఫైనల్ కోట్ బీసీ వర్క్ పనుల వివరాలను అధికారులు ఎమ్మెల్యే రాముకు తెలిపారు. బైపాస్ రహదారికి అనుసంధానంగా ఉన్న సీసీ రోడ్లకు కనెక్టివిటీ పనులు కూడా పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే రాము కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బైపాస్ రోడ్డు అభివద్ధి పనులు 90శాతం పూర్తయినట్లు, మరో రెండు రోజుల్లో తుది దశ పనులు కూడా పూర్తవుతాయన్నారు. త్వరలో బస్టాండ్ అభివద్ధి పనులు ప్రారంభం అవుతాయన్నారు. మరో ప్రధాన సమస్య అయిన కంకిపాడు రహదారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో ముందుంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం పమిడిముక్కల మండలంలోని కపిలేశ్వరపురం, హనుమంతపురం, మర్రివాడ గ్రామాలలో పలువు రికి సిఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పమిడిముక్కల మండలాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు లింగంనేని రామారావు, రాజులపాటి రామాంజనేయులు, ఎండూరు పిచ్చేశ్వరరావు, కొల్లిపర బాబి, మర్రివాడ గ్రామ సర్పంచ్ పంపు కడవల ఫ్రాన్సిస్ పాల్గొన్నారు

'విద్యావికాస్'లో వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ : విద్యావికాస్ 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విద్యావి వికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావుతో కలసి జ్యోతి పాలిటెక్నిక్ కాళాశాల ఫాండర్ సూరపనేని వెంకటరమణలు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు క్రమశిక్షణ అంకితభావం ఎంతో అవసరమన్నారు. విద్యావికాస్ విద్యార్థులు ర్యాంకుల కోసమే కాకుండా ఉన్నత విలువలు అలవర్చుకోవలన్నారు. గత ఏడాది అత్యధికంగా 590 మార్కులతో పాటు పదిమంది 550 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది విద్యార్తులు కూడా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించలన్నారు. అనతరం 10వ తరగతి విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్ర మంలో హెచ్ఎం చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, ప్రైమరీ హెడ్ మాస్టర్ పి.ఆశీర్వాదం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాదీపం కెబిఎన్ కాలేజీ : ఎంపి శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : పేద, మధ్య తరగతి ప్రజలకు ఉత్తమ విద్యావకాశాలు కల్పించాలనే సమున్నత ఆశయంతో స్థాపించిన విద్యాసంస్థ కెబిఎన్ కాలేజీ అని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కెబిఎన్ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు పూర్వ ద్యార్థుల సంఘం (కోసా) ఆధ్వర్యంలో ఆదివారం ఆనందోత్సాహాల మధ్య అత్యంత వేడుకగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివనాథ్ మాట్లాడుతూ 60 ఏళ్ళ వేడుక చేసుకుంటున్న కెబిఎన్ కాలేజీ పూర్వవిద్యార్థులు వేలాదిగా దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. చంద్రయాన్ ప్రయోగంలో కీలకమైన విడిభాగాలు తయారుచేసిన బి.ఎన్.రెడ్డి వంటి ప్రముఖుల ద్వారా కాలేజీ కీర్తి ఖండాంతరాలు దాటి వ్యాపించిందన్నారు. మరో మూడు నెలల్లో కాలేజీలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. టాలీవుడ్ నటుడు, కాలేజీ పూర్వవిద్యార్థి సుహాస్ మాట్లాడుతూ కెబిఎన్ కాలేజీ నేర్పించిన క్రమశిక్షణ, చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే సినీ రంగంలో తాను నిలదొక్కుకోవటం సాధ్యమైందన్నారు. సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి జె.ఎ.సి.ఎస్.రావు మాట్లాడుతూ కెబిఎన్ కాలేజీ అధ్యాపకులు ఇచ్చిన ప్రోత్సాహంతోనే చదువు పూర్తిచేసి

సివిల్ సర్వీస్ అధికారిగా ఉన్నట్లు చెప్పారు. మాజీ డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తనలోని క్రీడాసక్తిని ఇక్కడి అధ్యాపకులు గుర్తించి ప్రోత్సహించడం వల్లే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి పోలీసు శాఖలో ఉన్నతాధికారి స్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కెపివివి హిందూ హై స్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ గోపిశెట్టి మల్లయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు పాల్గొన్నారు. విశ్రాంత అధ్యాపకులు, ప్రముఖ పూర్వ విద్యార్థులను ఎంపి కేశినేని శివనాథ్ సత్కరించారు.

పొట్టి శ్రీ రాములు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ తూనుగుంట్ల శ్రీధర్ అన్నారు. ఆదివారం రామరాజ్యనగర్ జి.ఎన్.ఆర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఆవరణలో వాసవి క్లబ్ భవానీపురం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం లక్ష్యసాధన కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి విస్సంశెట్టి ఎన్వి కిరణ్ కుమార్, కూర్నాల శశికాంత్, జూపూడి చంద్రశేఖర్‌తోపాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రీటింగ్ కార్డులు తయారీ

విజయవాడ : విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం చిన్నారులకు గ్రీటింగ్ కార్డుల తయారీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ స్కూల్స్ నుంచి 30 మందిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. రకరకాల కలర్ పేపర్లు, కార్డులతో వినూత్నంగా ఒకరికి మించి ఒకరు గ్రీటింగ్ కార్డ్స్ తయారు చేశారు. గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ చిన్నారులు 2025కి వీడ్కోలు చెబుతూ 2026కి స్వాగతం పలుకుతూ ఉత్సాహంగా గ్రీటింగ్ కార్డులు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వై ధనలక్ష్మి, ఎం వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

దుప్పట్లు పంపిణీ

విజయవాడ : శీతాకాలం చలి బాధితులను ఎక్స్ రే సంస్థ దుప్పట్లు పంపిణీ చేసి ఆదుకుంది. శనివారం రాత్రి గాంధీనగర్ బి.ఆర్.టి.ఎస్ రోడ్డు, సంగీత కళాశాల ఏరియా, శారదా కళాశాల, మీసాల రాజారావు వంతెన, పెజ్జోనిపేట తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన, కాలువల పక్కన చలికి వణుకుతూ, దోమల బాధతో నిద్రలేని రాత్రులు గడుపుతున్న యాచకులు, నిర్వాసితులను కొందరు కవులు కళాకారులు జట్లుగా ఏర్పడి దుప్పట్లు పంపిణీ చేశారు. దివంగత కొల్లూరి స్ఫూర్తితో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంధానకర్త బోడి ఆంజనేయరాజు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మదేశం వసంత్ కుమార్, గుర్రం ఏడుకొండలు, జయశ్రీ, చామర్తి వెంకటసుబ్బయ్య, కేకే రావు, జి.లీలా శ్రీనివాస్, గంటేడ సుజాత, అడిదం ఉషాకుమారి, పరిమి భాస్కరశర్మ, జి.లీలా కుమార్, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో ఉజ్వల రికార్డు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : జగ్గయ్యపేటకు చెందిన దుడకా ఉజ్వల కూచిపూడి నృత్యంలో గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించింది. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 4,608 మంది కూచిపూడి కళాకారులు 40 నిమిషాల పాటు కూచిపూడి నృత్యం చేసి గిన్నిస్ బుక్ రికార్డు సష్టించారు. గచ్చిబౌలి స్టేడియంలో శనివారం భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం -2 పేరిట నిర్వహించిన ఈ ప్రదర్శనలో తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి వచ్చిన కళాకారులు ఉత్సాహంగా నాట్యం చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నుండి త్రినేత్ర కూచిపూడి నత్యాలయం టీచర్ భారతీదేవి శిష్య బృందం కుమారి దుడకా ఉజ్వల పాల్గొని బహుమతి, ప్రశంసా పత్రం పొందారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు చదువుకుని, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు నంది స్తాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి శ్రీను తెలిపారు. పెనుగంచి ప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కళ్ళ జగపతి అధ్యక్షతన ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మండల పరిషత్ అభివద్ధి అధికారి జి.శ్రీను మాట్లాడుతూ చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకునే యువ పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం జెడ్ (జీరో ఎఫెక్ట్, జీరో డిఫెక్ట్) సర్టిఫికెట్ ఉచితంగా జారీ చేస్తుందని తెలిపారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3లక్షల వరకూ రుణ సదుపాయంతో పాటు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తాయని తెలిపారు..

అలరించిన సాంప్రదాయ నృత్యాలు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాష సృజనాత్మకత, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో- విజయవాడ సాంస్కృతిక సమితి, ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ (న్యూఢిల్లీ) సంయుక్త నిర్వహణలో ఆదివారం శ్రీఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ సంగీత కళాశాల ఆవరణలో.. ప్రథమ రాష్ట్రస్థాయి సంప్రదాయ నృత్యోత్సవాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల విభిన్న నృత్యాలను ప్రేక్షకులు ఎంతగానో ఆనందించారు. కార్యక్రమాన్ని సుఖమంచి కోటేశ్వరరావు, బి.జోష్ మేరీ సమన్వయపరిచారు. తొలుత గువ్వల స్రవంతి జ్యోతి ప్రజ్వలన గావించారు. గోళ్ళ నారాయణరావు, ఆనందగిరి నరసింహారావు, మూర్తి రాజు, రాయన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను కూరపాటి మన్మథరావు, అయాచితుల రామకృష్ణ, ఈఎస్ పవన్ కుమార్, ఎఎన్ రావు, ఆర్.రాజేశ్వరి నిర్వహించారు.

అలరించిన రాగలహరి

విజయవాడ : రాగలహరి 'న్యూ ఇయర్ హంగామా' ఆదివారం గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్‌లో ఘనంగా జరిగింది. "నీకోసమే మేమందరం.. నీ రాకకే ఈ సంబరం" మకుటంతో జరిగిన ఈ సినీ సంగీత కచేరీలో సత్యస్వాతి, సూర్య (ఆర్గనైజర్స్) మోహన్ కృష్ణ, శ్రీనివాస్ (వ్యాఖ్యాత), వెంకట్, గుజ్జుల శ్రీనివాసరెడ్డి, రామభద్ర, అర్జున్ కర్నాటి, వి.ఉమామాధవి, పండు, టి.కె.శ్రీనివాస్, మున్నాభాయ్ (ట్రాక్స్) తదితర గాయనీ గాయకులు పాడిన వివిధ పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి.

కరాటేలో రమ్య శ్రీ ప్రతిభ

ప్రజాశక్తి-జి కొండూరు : జి.కొండూరు శ్రీశ్రీ పాఠశాల విద్యార్థిని గొర్రె రమ్య శ్రీ విజయవాడ సింగ్ నగర్ లో ఆదివారం జరిగిన కియో జపాన్ ఫోటోకాన్ కరాటే ఇండియా వారు నిర్వహించిన కరాటేలోని బ్లాక్ బెల్ట్ టెస్ట్ పరీక్షలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కరాటే కోచ్ మురళీ మాట్లాడుతూ ఆడపిల్లలకు స్వీయ రక్షణకు తీసుకునే చర్యలను ఇలాంటి నైపుణ్యాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. శ్రీశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ కొల్లు కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్వీయ రక్షణకు ప్రతి విద్యార్థిని కరాటే లాంటి ఆత్మ రక్షణ విద్యను నేర్చుకోవాలని అన్నారు. పాఠశాలలోని విద్యార్థుల ఆధ్వర్యంలో రమ్యశ్రీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



24 నుంచి పలూజా లైవ్ మ్యూజికల్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రఖ్యాతిగాంచిన లొల్లా పలూజా లైవ్ మ్యూజికల్ కార్యక్రమం జనవరి 24 నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్టు ఎయిర్ బియన్‌బి హెడ్ అమన్‌ప్రీత్ బజాజ్ వెల్లడించారు. ఈ మేరకు తాజాగా ఆదివారం నగరంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఆతిథ్య రంగ ఆన్లైన్ మార్కెటింగ్ సంస్థ ఎయిర్ బీయన్బీ భాగస్వామ్యంలో లొల్లా పలూజా సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ సంగీత లైవ్ కార్యక్రమం జనవరి 24, 25 తేదీల్లో జరుగుతుందని చెప్పారు. లొల్ల పలుజ సంగీత కార్యక్రమం ముందస్తు ప్రచార ర్యాలీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ జరపనున్నామని చెప్పారు.

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి సుధారాణి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు.ఆదివారం అమ్మవారి దర్శనార్థం ఇంద్రకీలాద్రి కి విచ్చేసిన మంత్రి సంధ్యారాణి కి పండితులు, ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కి ఆశీర్వచన మండపంలో పండితులు వేద స్వస్తి అందజేశారు. దేవస్థానం సిబ్బంది అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం తో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే దుర్గగుడిలో కరెంటు కోత

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : దుర్గగుడిలో కరెంటు నిలిపివేయడానికి కారణం రూ.3.8 కోట్ల కరెంట్ బిల్లు బకాయిలు చెల్లించకపోవడమేనా అని వైసిపి విజయవాడ, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన వెంకట మహేష్ సందేహం వ్యక్తం చేశారు. ఇంద్రకీలాద్రిపై శనివారం విద్యుత్ కోత ఏర్పడిన నేపథ్యంలో ఈ విషయంలో దుర్గ గుడి అధికారుల తీరును తప్పుబడుతూ ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంద్రకీలాద్రి పెండింగ్ విద్యుత్ బిల్లులు ఇప్పటికి అనేకసార్లు విద్యుత్ శాఖ అధికారులు నోటీసులు ఇచ్చిన దుర్గగుడి అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. దేవాదాయ శాఖ కమిషనర్, ఆ శాఖ మంత్రి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న వ్యవహారాలపై ఎందుకు దృష్టి సారించడంలేదని నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యం వైఖరి వల్లనే అమ్మవారి ఆలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ అంశంపై కూటమి ప్రభుత్వం యాత్రికులకు వివరణ ఇవ్వాలని కోరారు .